# ఇంటి పేరు ఇంద్రగంటి









## శ్రీకాంతశర్మ

ఆత్మకథ

**INTIPERU**
**INDRAGANTI**
*(An Autobiography)*
*By :* ***Srikantasarma***
Cell : 98480 78079

*First Edition :* January 2017

*Cover Design :* Giridhar

*Published by :*
INDRAGANTI FAMILY
104, Santhi Residency
Premnagar Colony, (G.K. Colony)
Sainikpuri (P.O)
Secunderabad - 84

*For Copies :*
సాహితీమిత్రులు
Regd. No. 48/2012/IV విజయవాడ
# 28-10-16, Maszid Street
Arundelpet, Vijayawada - 520 002
Ph. : 0866 2433359, 93929 71359

*Printed at:*
Sri Sri Printers
Vijayawada - 520 002
Cell : 9490634849

Price : Rs - 200 /-

# ఒకటవ ప్రకరణం

## బ్రాహ్మణ్యం

ఆంధ్రబ్రాహ్మణశాఖలు జగత్ప్రసిద్ధాలు.

ప్రముఖమైన విభాగాలు - నియోగి - వైదికి - శైవ - వైష్ణవ - మధ్వ - వీరశైవ - ద్రావిడ శాఖలు.

అవాంతరశాఖలు వర్ణనాతీతంగా ఉన్నాయి. నియోగుల్లో - ప్రథమశాఖ, ఆరువేల, ప్రాజ్ఞాటి, వెలనాటి, నందవరీక, తెలగాణ్య నియోగి, ద్రావిడనియోగి, ఐ. కరణకమ్మ నియోగి, లింగధారిని యోగి, ములకనాడు నియోగి, కాసల్నాటి నియోగి, పాకనాటి నియోగి, మధ్వనియోగి, శ్రిష్టికరణ, వైదిక కౌండిన్యనియోగి, కశ్యపనియోగి, మహారాష్ట్ర చిత్పవన, కోసలేయ; వేఁగినాటి నియోగి -

వైదికుల్లో- వెలనాటి, వేఁగినాటి, ములకనాటి, కోసలనాటి, తెలగాణ్య, కరణకమ్మ, స్మార్తములికినాటి, ప్రథమశాఖవైదికి-

శైవుల్లో-వీరశైవులు, ఆదిశైవులు, శైవపూజారులు, లింగధారులు, ఆరాధ్యులు, శైవస్మార్తులు,- వైష్ణవుల్లో-తెంగళ్‌వారు, వడగళ్‌వారు ప్రముఖ విభాగం.

అవాంతరశాఖలుండవచ్చును. (శ్రీవైష్ణవ, వైఖానస ఆది)

ద్రావిడుల్లో- ఆరామద్రావిడ, పుదూరు ద్రావిడ, దివిలి ద్రావిడ, తుమ్మగుంట ద్రావిడ, పూటూరు ద్రావిడ, పూమాల ద్రావిడ,-

ఇంకా- గోల్కొండ వ్యాపారులు, కాణ్వేయులు, యాజ్ఞవల్క్యులు, బడగలనాటి కన్నడులు... ఆదిగా- యాభైవరకు దాదాపుగా శాఖలు విస్తరించాయి. ఈ జాపితా నా పరిమితమైన ఎరుక మాత్రమే-.

## తెలగాణ్యం

ఈ శాఖల్లో తెలగాణ్యశాఖ ఒకటి.

ఇది తెలంగాణ ప్రాంతాలనుంచి ఆంధ్రగ్రామాలకు, పట్టణాలకు వలసగా వచ్చినశాఖ.

బహుశా-మహమ్మదీయుల పరిపాలనాకాలంలో - రాజకీయ, సాంఘిక సంబంధమైన ఒత్తిడులవల్ల కొన్ని బ్రాహ్మణకుటుంబాలు తరలి వెళ్లిపోయి ఉంటాయని చెప్పుకోగా విన్నాను.

రాయప్రోలు, దేవులపల్లి, మంగళంపల్లి, రాచకొండ, దేవరకొండ, కోలాచల, వేలూరి,

# రెండవ ప్రకరణం

## ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

ఇక్కడ నుంచి ఏం మాట్లాడినా నేను నాతండ్రిగారి గురించి వ్రాస్తున్నాననికాక, తటస్థంగా నిలబడి–చిన్ననాటినుంచి ఒక వ్యక్తిగా ఆయన ఎలా పరిణమించారో చెప్పడం నా ఉద్దేశం. నేను వయస్సులో పెద్దవాడనవుతూండగా వేరువేరు ప్రత్యేక సందర్భాలలో మేము ఏకాంతంగా ఉన్నప్పుడు–తన జీవితంలో ఎదురైన ఘటనలగురించి, వ్యక్తులగురించి, ఏ అరమరికలులేక ఆయన చెపుతూండేవారు.

"ప్రాప్తే తు షోడషే వర్షే పుత్రం మిత్రివ దాచరేత్" అనే ప్రాచీన ఆదేశాన్ని అక్షరాలా పాటించారు. నాకు చెప్పడమేకాదు; కొన్ని సంర్భాలలో తనకవిత్వంలో, కథలలో, నాటికలలో వ్యక్తం చేస్తూవచ్చారు. ఆ ముక్కలన్నీ అతికి మధ్యమధ్య ఖాళీ పూరిస్తే శాస్త్రిగారి జీవితమవుతుంది.

1911 ఆగస్టునెల 29 తేదీన (విరోధికృతునామసంవత్సరం భాద్రపద శుద్ధషష్ఠి) విశాఖజిల్లా, వీరవల్లి తాలూకా మాడుగులలో జన్మించారు. సంస్థానగ్రామం అని చెప్పానుకద! దీనిని వడ్డాది మాడుగుల అనికూడా అంటారు. పిప్పలికట్టె, సన్నఆవాలు, హల్వాలకు ప్రసిద్ధి. సూర్యనారాయణగారి ఏడుగురు సంతానంలో రెండవ మొగపిల్లవాడిగా పుట్టిన శాస్త్రిగారి బాల్యం, పెద్దసంసారంలో పిల్లలకి ఎంతజరుగుతుందో, ఆపాటి మాలిమితోనే నడిచింది. తండ్రిగారి ప్రాథమిక పాఠశాలలోనే తొలి చదువుగడిచింది.

నిజానికి–పండితకుటుంబం అయినందుకు తన తండ్రికి సంస్కృతవిద్య అబ్బివుంటే, ఆయన తొలిచదువు శబ్దమంజరి, అమరకోశం, ధాతుమంజరి, లఘుకౌముది వంటి గ్రంథాలతో, పంచకావ్యపాఠాలతో గడిచివుండేది. అలా జరగలేదు. కాని, తరవాత కోనసీమలో జరిగింది. ఇందుకు ప్రధానసూత్రధారురాలు పెద్దక్క పార్వతమ్మ.

సూర్యనారాయణగారికి తనకొడుకుల్లో ఒకడైనా పండితుడు కావాలనే కోరిక ఉందికద! దానిని నెరవేర్చడానికి నడుంకట్టింది.

తూర్పుగోదావరిజిల్లాలోని గోదావరినడుమ కోనసీమ, బ్రాహ్మణాగ్రహారాల తీరులో వేదశాస్త్రాలకు నిలయంగా ఉండేది. ఉద్దండపండితులు ఉండేవారు. తన అత్తవారి ఊరు పాలగుమ్మేనాయె! భర్తమరణించినా, మామగారింట ఆమె మాటకి చెల్లుబాటుండేది. అందువల్ల

# కాకర్లపూడివారి సంస్థానం

రామచంద్రపురాన్ని "కోట" పూర్వకంగా పిలవడానికి కారణం, తూర్పుగోదావరిజిల్లా కొత్తపేట తాలూకాలో మరొక రామచంద్రపురం ఉండడం.

కోట– రామచంద్రపురంలో పాలకులు కాకర్లపూడి రాజవంశంవారు. అయితే, పిఠాపురం, పెద్దాపురంవంటి ఇతర సంస్థానాలకున్నంత చరిత్ర దీనికి లేదు. అక్కడ విరళంగా పండితపోషణ జరగకపోనూలేదు.

ఈ కాకర్లపూడి వారి సంస్థానచరిత్రలో రామచంద్రరాజు, వారి తమ్ముడు జగన్నాథరాజు గారల హయాంలో శిష్టుకృష్ణమూర్తి శాస్త్రి, పిండిప్రోలు లక్ష్మణకవి, వంటి కవి పండితులుండేవారు. ఈ సంస్థానానికి కులబ్రాహ్మణులు తొలుతటి కాలంలో, సుప్రసిద్ధ ధర్మశాస్త్రవేత్త, ఇంద్రగంటి విశ్వపతిశాస్త్రిగారు.

తరాలుగడిచాక ఆ పదవి బ్రహ్మశ్రీ గరిగిపాటి వేంకటరత్నంగారికి దక్కింది.

నాటినుంచి– శ్రీరాజగోపాలనరసరాజుబహద్దరువారు వారి సతీమణి రాణి జానకమ్మగారు గరిగిపాటివారి కుటుంబంపట్ల అత్యంత ఆదరగౌరవాలు చూపించేవారు.

వేంకటరత్నంగారికి ఒక్కడే కొడుకు. ఒక్కతే కూతురు.

కొడుకు సుబ్బారాయడు కాకినాడ పిఠాపురంరాజాగారి కాలేజీలో ఇంటర్మీడియెట్ చదివాడు. రెవెన్యూ డిపార్టుమెంట్‌లో డిప్యూటీ తహసీల్‌దార్ ఉద్యోగంచేస్తూ, చిన్నవయసులో చనిపోయాడు. ఆయనకి ఒక కొడుకు ఇద్దరు కూతుళ్లు. కొడుకు ముగ్గురిలో పెద్దవాడు. పేరు సూర్యరత్నం. స్కూలుఫైనల్ వరకు రామచంద్రపురం హైస్కూలులోనే చదువుకుని, మున్సిఫ్‌కోర్టులో, తరవాత జిల్లాకోర్టులో పనిచేసి, హెడ్‌క్లర్క్‌గా పదవీవిరమణ చేశాడు. ఇతడి తరవాత అమ్మాయి వెంకటలక్ష్మి, రామచంద్రపురంలోనే ప్రముఖ జ్యోతిష్కులు గుత్తిన పట్టాభిరామయ్యగారి కోడలు. ఈమె భర్త నరసింహం. ఈమె తరవాత అమ్మాయి, సంతానంలో చివరిది, వేంకటరత్నమ్మ, శాస్త్రిగారి భార్య, మాఅమ్మ.

గరిగిపాటి వేంకటరత్నంగారు తన మనుమరాలిని, హనుమచ్ఛాస్త్రికిచ్చి వివాహం చెయ్యబోయేముందు, రాజావారి కీవిషయంచెప్పి, యీకుర్రవాడికి రామచంద్రపురం హైస్కూలులో తెలుగుపండితుడిగా ఉద్యోగం ఇప్పించాలని విన్నవించుకున్నారు. శ్రీరాజగోపాల నరసరాజుబహద్దర్ గారు అప్పటికి తూర్పుగోదావరిజిల్లా బోర్డు అధ్యక్షులుగా ఉండేవారు. కులగురువు కోరికను మన్నించి,–తప్పక ఇస్తామని మాట ఇచ్చారు. మనుమరాలు ఎక్కడో పరాయి ఊరు వెళ్లిపోకుండా కళ్లఎదుటే ఉంటుందని వేంకటరత్నం గారి ఆశ.



శ్రీ రాజా కాకర్లపూడి రాజగోపాల నరసరాజు బహద్దర్

స్కూళ్లసంఖ్య తక్కువగా ఉన్న 1930ల కాలంలో ఉద్యోగం రావడం అంటే మాటకాదు. ఈపెళ్లి జరగడానికి పార్వతమ్మగారు, వింజమూరి పేరిశాస్త్రిగారు పట్టుపట్టడానికి ఇదొక బలమైన కారణం.

# మూడవ ప్రకరణం

## సొంతిల్లు కథ

ఉద్యోగంలో జేరిన సుమారుపదేళ్ల వరకు అద్దెఇళ్లలో గడిపిన శాస్త్రిగారికి 1943లో సొంతిల్లు ఏర్పరచుకొనే అవకాశం వచ్చింది. రామచంద్రపురంలో ఊరికి చివరగా ఉన్న చిన్నరాజుగారి తోటను ఇళ్లస్థలాలుగామార్చి విక్రయిస్తున్నారని తెలిసింది. అక్క పార్వతమ్మ తనపేరిట వ్రాసిన మామిడితోట అమ్మేసి అక్కడ ఒక కుంచెడు స్థలం (కొద్ది గజాలు తక్కువగా 500గజాలు) కొన్నారు. దాని ఖరీదు 150రూపాయలు. 300రూపాయలు ఖర్చుచేసి పచ్చి ఇటుకలతో ఒక తాటాకుఇల్లు నిర్మించుకున్నారు. 1954 వరకుకూడ అది తాటాకు ఇల్లే. నిజానికి మా బ్రాహ్మణ అగ్రహారంలాంటి రెండువీధులనిండా తాటాకిళ్లే. ఒకమేడ, ఒకడాబా, రెండు పెంకుటిళ్లు మినహాయింపు. ఇన్ని బ్రాహ్మణ ఇళ్లమధ్య ఒక్క భోగంవారి ఇల్లు ఉండేది. అదీ చాలాకాలం తాటాకుఇల్లే. అందులో ఇద్దరు యువతులు, వారి తండ్రి ఉండేవారు. వాళ్లిద్దరు కులవృత్తి చేసేవారు. కొంతకాలానికి వాళ్ల ఇద్దరు సోదరులూ కూడా వారింటిపక్కనే స్థలాలు కొనుక్కొని స్థిరపడ్డారు. ఆ యువతులు మా మా ఇళ్లలో పేరంటాలకీ, శుభకార్యాలకీ వస్తూండేవారు. హుందాగా–అంతే వేరుగా– ఉండేవారు.

1954లో శాస్త్రిగారు 2000/- రూపాయలు ఖర్చుపెట్టి–తాటాకిల్లు తీసేసి మంగుళూరు పెంకుటిల్లు కట్టారు. 1955లోనో 1956లోనో మాయింటికి ఎలక్ట్రిసిటీపెట్టించారు. ఒక్కటే టేబిల్‌ఫ్యాన్ ఉండేది (ర్యాలీకంపెనీ). 1959లో రెండు బ్యాండ్ల–వాల్వు రేడియోకొన్నారు. (మర్ఫీకంపెనీ). అది నా స్కూలుఫైనల్ సంవత్సరం.

మా అన్నయ్యలిద్దరూ అద్దె ఇళ్లలో ఉండగా పుట్టారు. నేను 1944లోనూ, మాచెల్లెలు 1946(47?)లోనూ ఇదే (తాటాకు) ఇంట్లోపుట్టాం.

నాచరిత్ర 1953–1959 నడుమ రామచంద్రపురంలో ప్రారంభమైంది. (పదేళ్ల వయస్సులో).

అలనాటి రామచంద్రపురంలో మారత్నంపేట, బిక్కిన వేంకటరత్నంగారితోట ఇళ్లనుంచి వ్యాపించి, చిన్నరాజుగారితోటలో కట్టుకున్న ఇళ్లవరకు ఉండేది. కస్తూరివారితోట, కోటసాంబయ్య గారి మామిడితోట, కస్తూరివారిల్లు వగైరా ఇందులోనివే.

భోగంవారి శేషాలు, శ్రీలక్ష్మి కొనుక్కున్న ఇల్లు గోపాలం అనే ఆయనది.

# నాలుగవ ప్రకరణం

## సంసార యాత్ర

మేము నలుగురం పిల్లలం అని చెప్పానుకద! మాలో పెద్దవాడు భానుమూర్తి, ఇతను 1938 ఆషాఢమాసం తొలిరోజున పుట్టాడు. 1954లో రామచంద్రపురం హైస్కూలులోనే స్కూలుఫైనల్ పాసయ్యాడు. చిన్నప్పటినుంచి శాస్త్రిగారికి ఇతనంటే చాలా ప్రేమ. పెద్దకొడుకు కద!

చిన్నతనం నుంచి ఇతనిదొక చిత్రమైన స్వభావం. ఈగుణం వయస్సు పెరిగేకొద్దీ పెరగడం నేను గమనించాను. ఇతను నాకంటె ఆరేళ్లు పెద్ద. నాకు ఆరేళ్ల వయస్సునుంచి (అతనికి పన్నెండేళ్లు) భానుమూర్తి స్వభావం తెలుసు. ఇతనికి కొన్ని కాంప్లెక్సెస్ ఉన్నాయి. చాలా గార్డెడ్‌గా ఉండేవాడు. తన ఉద్దేశాలు, నిర్ణయాలు, చర్యలు ఎవరికీ తెలియకూడదని ఉండేది. ఎదటివారు ఎవరైనా తనని చిన్నచూపు చూస్తున్నారేమోనని అనుమానం. తనవ్యక్తిత్వం పట్ల గొప్పనమ్మకం. తను ఏమిచేసినా, సత్ఫలితం వచ్చిన తరువాత ఎదుటివారికి తెలియాలిగాని, ముందుగా తెలియకూడదు. ప్రతిదీ రహస్యం. అతను చాలా నిజాయితీపరుడు. ఎవరిచేత మాటపడడం ఇష్టంలేదు. అతని మనస్సొక రహస్యమందిరం. మాచిన్నన్నయ్య సుబ్బరాయశాస్త్రి అంటే చాలా ఇష్టం. నాకు మా చిన్నన్నయ్య దగ్గర చనువెక్కువ. చిన్నతనంనించి కలిసే తిరిగేవాళ్లం. 'అపూర్వసహోదరు"లని వేళాకోళం చేస్తూండేవారు. నాకు పదహారేళ్లు దాటేవరకు, భానుమూర్తి నన్నెలా చూస్తున్నాడో, అర్థంచేసుకుంటున్నాడో అర్థంకాలేదు. అప్పుడర్థమైన దగ్గర్నుంచి అతనంటే తెలియని ఒక భయం పట్టుకుందినాకు. ఆ విశేషాలు, నా కథ ప్రారంభమయ్యాక చెపుతాను.

భానుమూర్తికి మానాన్నగారంటే కూడ చాలాఇష్టం. ఆయనలాగే తెలుగు చదువుకుని రచయిత అయిపోవాలని కలలుకన్నాడు. అతను మంచి చిత్రకారుడు కూడ. బాగా పాడుతూండే వారు. అతనిలో చిత్రకళపట్లగల నేర్పు గమనించి, మానాన్నగారు శ్రీదశిక సుబ్బరాయశర్మగారి దగ్గర చిత్రకళలో తర్ఫీదు ఇప్పించారు. స్కెచింగ్, లైన్ డ్రాయింగ్, కలరింగ్ మెళకువలు ఆయన బోధించారు. చాలాశ్రద్ధగా ప్రాక్టీస్ చేసేవాడు. కవిత్వం, కథారచన, ఇష్టం. ముఖ్యం గేయరచన.

తన సాహిత్య వ్యాసంగంలో ఇతడిని దగ్గరకుతీసి తనతో కూడా సభలకు వెళ్లేటప్పుడు తీసుకువెళ్లేవారు నాన్నగారు.

ఆయీ కారణాలు పురస్కరించుకుని ఇతను తెలుగుచదువుపై చూపించే అభిలాషను గమనించి, స్కూలుఫైనలు పాసవగానే ఆంధ్రవిశ్వవిద్యాలయంవారి భాషాప్రవీణ బిరుదపట్టం

# అయిదవ ప్రకరణం

## కావలి జీవితం

ఆ ఛలోక్తికి నా కథనం, ఈపేరు విశ్లేషణ, నాకథ చెప్పినప్పుడు వివరిస్తాను.

1962 అష్టగ్రహకూటమి సందర్భంగా ప్రళయంరాలేదుగాని–1964లో హనుమచ్ఛాస్త్రికి, అనూహ్యంగా స్థానచలనం సంభవించింది. ముప్ఫయ్యేళ్ల రామచంద్రపురం జీవితం ముగిసి–53వ యేట ఉద్యోగం మారిపోయింది. నెల్లూరుజిల్లా కావలి విశ్వోదయ సంస్థ నడిపే 'కావలికళాశాల'లో తెలుగు సంస్కృతం, బోధించడానికి లెక్చరర్‌గా పిలుపువచ్చింది. కావలినుంచి జంగా సుబ్బారాయడు అనే లెక్చరర్‌ని పంపి రెక్టర్ డి. రామచంద్రారెడ్డిగారు ఆహ్వానించారు. దానిమీద, ఆహ్వానానికి సంతోషించినా, 30ఏళ్ల సర్వీసు, సొంతిల్లు, ఇంక అయిదేళ్లే స్కూలుసర్వీసు. ప్రశాంతంగా రామచంద్రపురంలోనే ఉండిపోతే నష్టమేమిటి?–అని తర్జనభర్జనలు చేసుకుని–చివరికి కావలి వెళ్లడానికే నిర్ణయించారు. ఒక షరతుమాత్రం పెట్టారు. భానుమూర్తికి కూడా ఉద్యోగం ఇవ్వాలి. అతను భాషాప్రవీణతోపాటు బి.ఏ. పాసయ్యాడు, తనకు ఆసరాగా ఉంటాడు. ఈ షరతుకు రెడ్డిగారు అంగీకరించారు. అయితే–శాస్త్రిగారితోపాటే అతడిని తీసుకువెళ్లలేదుగాని–కొంతకాలం గడిచాక–ఉద్యోగం ఖాళీ ఏర్పడగానే భానుమూర్తికి ముందు తెలుగుశాఖలో ట్యూటరు ఉద్యోగం ఇచ్చారు. అతడు తరవాత శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి ఏం.ఏ డిగ్రీ తీసుకుని ముందు జూనియర్ కాలేజీలోనూ, ఎంఫిల్ కూడా చేసి, డిగ్రీకాలేజీ లోనూ లెక్చరర్ అయ్యాడు.

హనుమచ్ఛాస్త్రికి కావలికాలేజి నుంచిపిలుపు రావడానికి కారణం కృష్ణశాస్త్రిగారు.

కావలి విశ్వోదయసంస్థ రెక్టర్ రామచంద్రారెడ్డి గారికి కృష్ణశాస్త్రిగారంటే అమితగౌరవం. కావలికాలేజి స్థాపిస్తూనే గొప్ప ఆదర్శాలతో స్థాపించారు. తెలుగుశాఖలో ఒక ప్రసిద్ధకవిని తీసుకువచ్చి, విద్యార్థులకు పాఠం చెప్పించాలని రెడ్డిగారికోరిక. 1950లో ఆ కళాశాల స్థాపించగానే ప్రసిద్ధకవి వేదుల సత్యనారాయణశాస్త్రిగారిని నియమించమని సూచించినవారు కూడా కృష్ణశాస్త్రిగారే!

1964లో వేదులవారు పదవీవిరమణ చేశాక వేరే ఎవరిని తీసుకువస్తే బాగుంటుందని రెడ్డిగారు కృష్ణశాస్త్రిగారిని కోరగా హనుమచ్ఛాస్త్రిపేరు సూచించారు. ఈయనతోపాటుగా, మరొక సుప్రసిద్ధ కవి పుట్టపర్తి నారాయణాచార్యులుగారిని కూడా తెలుగుశాఖలోకి ఆహ్వానించారు కాని, పుట్టపర్తివారు ఇతరేతర వ్యక్తిగత కారణాలవల్ల రాలేదు.

# మొదటి ప్రకరణం

## నా బాల్యం

1949- నాకు అయిదేళ్లు. మాఅమ్మ, మేము ముగ్గురుపిల్లలం, మా అమ్మమ్మగారింట్లో ఉన్నాం. అప్పట్లో పెద్దతుపాను వచ్చి రత్నంపేటలో వున్న మాయిల్లు కొంతభాగం కూలిపోయింది. మానాన్నగారు ఆ యింటిని పునరుద్ధరించే పనుల్లో ఉండిపోగా-మేలు అమ్మమ్మగారింట్లో ఉండడం తటస్థించింది.

నాకు టైఫాయిడ్ జ్వరం వచ్చింది. ఆరోజుల జ్ఞాపకాలేవీ స్పష్టంగా లేవు. మసకమసకగా కొంత గుర్తొచ్చీరాకుండా ముఖాలూ, కొన్నిపేర్లు, పొగమంచుమాదిరి నా మనస్సుమీదనుంచి వెళ్లిపోతూంటాయి. కాని కొన్నిబలమైన మాటలు, ఒకటి రెండుఘటనలు మాత్రం గట్టిగా గుర్తున్నాయి.

"కవిగా డెక్కదర్రా"-మాఅమ్మమ్మ గొంతు. "చచ్చిపోయాడు"-ఇంటిసందులో తోటిపిల్లలతో గోటిబిళ్ల కాబోలు ఆడుతున్న భానుమూర్తి గొంతు-

నే నాపక్కనే, పథ్యంతిని గడపమీద కూర్చుని ఉన్నాను. అమ్మమ్మ అతన్ని గట్టిగా తిట్టి, నన్ను రెక్కపట్టుకుని లోపలికి తీసుకువెళ్లింది.

నా పుట్టుక తరవాత-ఆ అయిదేళ్ల వయస్సులో గుర్తున్న ఘటన యిది.

అదేంచిత్రమో, -నేను వయస్సుతో ఎదిగి పెళ్లయ్యేసంవత్సరంవరకు ఎప్పుడువచ్చినా మామూలుజ్వరం వచ్చేదికాదు; టైఫాయిడ్ జ్వరమే వచ్చేది. నాకు ఎనిమిదేళ్ల వయస్సులో అనుకుంటాను 'క్రిమివాతం' అంటారట-ఆ జబ్బు వచ్చింది. అప్పుడు మాఅమ్మ రెండవమామయ్య లలితాప్రసాద్ (రాజాతాతయ్య) నాకు హోమియోవైద్యం చేసీ, ప్రముఖ ఆయుర్వేద వైద్యులు తేజోమూర్తుల గురునాథంగారు పొడులూ, కషాయాలవైద్యం చేసీ, నన్ను బతికించారు.

చచ్చిపోవలసినవాణ్ణే!-ఇంతకథ నడవవలసిఉండగా ఎలా చచ్చిపోతాను?-

పదేళ్లలోపు వయస్సులో నాలో బలంగా మిగిలిన జ్ఞాపకాలు రెండు: ఒకటి: చాగంటి బంగార్రాజుగారమ్మాయి లలిత పెళ్లి. ఆమె చాలా అందంగా ఉండేది. పందిళ్లు వేసి, వైభవంగా చేశారు. రెండు: మావీధికి కొంచెం ఎడంగా ముచ్చుమిల్లిరోడ్డులో షిర్డీసాయిబాబా గుడి ఉండేది. మానాన్నగారు ఆ గుడినీ, అక్కడ ఉండే సాయిబాబాభక్తురాలు కృష్ణవేణిగారినీ (అందరూ పెద్దక్కయ్య అనేవారు) వెటకారంచేస్తూ మాట్లాడేవారు. నేను సాయంకాలం ప్రసాదాలవేళకి వెళ్లేవాణ్ణి.

# రెండవ ప్రకరణం

## కాలేజీ చదువు

రామచంద్రపురంలో ఇల్లువిడిచి, కాకినాడకు రావడం నాకు పెనుమార్పు. అంత పెద్దకాలేజీలో (తోటలో కాలేజీ అనేవారు) మెయిన్ బిల్డింగ్‌కి ఇటూ అటూ విసిరేసినట్టు రెండు పాతకాలపు బంగళాలుండేవి. ఒకటి అండమాన్, రెండోది నికోబార్ అని పిలవబడేవి. అండమాన్ బంగళా చిన్నదిబ్బమీద ఉండేది. అక్కడ మా క్లాసులు జరిగేవి.

మా మామయ్య వాళ్లు రామారావుపేటలో, ఏనుగు గుమ్మాలవీధిలో ఉండేవారు. అక్కడనుంచి కాలేజీకి వెళ్లాలంటే మధ్యలో కుళాయి చెరువు ఆవరణ అడ్డుగా ఉండేది. అక్కడొక రింగ్‌గేట్ దాటుకుని, నేరుగావెళ్లేమాటుంటే ఇబ్బంది లేదు. సైకిళ్లను వెళ్ళనిచ్చేవాళ్లుకాదని గుర్తు. కాలేజీలో చేరగానే నాకు తొలిగాపరిచయమైన వ్యక్తి మానాన్నగారి మిత్రులు శ్రీ కనకండి గోపాలకృష్ణశాస్త్రిగారి అబ్బాయి విశ్వపతి. చాలా సరదాగా, హుషారుగా ఉండేవాడు. అతని గ్రూపు ఎమ్.పి.ఎ. అనగా– అకౌంటెన్సీ కూడా– మిగతా రెండు సబ్జెక్ట్స్‌తో ఉండేది. అయితే అతని క్లాసులు కూడా అండమాన్‌లోనే. కలిసివెళ్లి వస్తూండేవాళ్లం. సినిమాలకి కూడా అరుదుగానైనా వెళ్లేవాళ్లం.

ఇలాఉండగా–అనుకోని విధంగా బాపూజీ నాజీవితంలోకి ప్రవేశించాడు. నాకు చుట్టంకూడా. రామచంద్రపురంలో మా అమ్మ తాతాసహోదరులఇళ్లు వరసగా మెయిన్‌రోడ్డుమీద వుండేవని చెప్పాను కదా! మా పెద్దతాతయ్యగారిల్లు, పక్కనే చిన్నతాతయ్యగారిల్లు, ఆపక్కనే సత్యంతాతయ్య గారిల్లు.

ఈ సత్యంతాతయ్యగారికి ముగ్గురుకొడుకులు. నానాజీ, చిరంజీవిరావు, సత్యనారాయణ. ఒకతే కూతురు. అమ్మలు అనేవారు (అసలుపేరు లీలావతి). వీళ్లంతా మాఅమ్మకి బాబయ్యల వరుస, "అమ్మలు" అత్తయ్య వరుస. మేం వీళ్లని కూడా తాతయ్యలనే పిలిచేవాళ్లం. అమ్మాయిని మాత్రం అత్తయ్య అనే పిలిచేవాళ్లం.

ఈ సోదరులలో చిరంజీవిరావు ఎలక్ట్రికల్ ఇంజనీరు. అమ్మ లత్తయ్యభర్త భాస్కరశాస్త్రి. ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్. చిరంజీవిరావుగారి పెద్దకొడుకు బాపూజీ. అసలుపేరు సుబ్బారావు. మా అమ్మకి తమ్ముడివరస. నావయస్సువాడే. వాడూ పి.ఆర్.కాలేజీలోనే పి.యు.సి, ఎమ్.పి.ఎ. కోర్సులో చేరాడు. వాళ్ల తాత (అమ్మతండ్రి) ప్లీడరు. పెద్దవయసాయన. వాళ్లింట్లో వీడు ఉండేవాడు. వాళ్లిల్లూ రామారావుపేటలోనే; ఈశ్వర పుస్తకభాండాగారం వీధిలో.

# నాలుగవ ప్రకరణం

## కొవ్వూరు చదువు

1963లో నేను చేరేసమయానికి బ్రహ్మశ్రీ జటావల్లభుల పురుషోత్తంగారు ప్రిన్సిపల్. శ్రీ కేశిరాల వేంకట నృసింహ అప్పారావుగారు వైస్-ప్రిన్సిపల్ శ్రీయుతులు కట్టిరామమూర్తి శాస్త్రి, పేరి వేంకటేశ్వరశాస్త్రి, ధూళిపాళ రామచంద్రశాస్త్రి, కలగ వేంకట సుబ్బారాయుడు, శ్రీమాన్ రొంపిచర్ల శ్రీనివాసాచార్యులు, మహీధర కామేశ్వరరావు, వీరఘంటం సత్యనారాయణ, శ్రీమాన్ ఈయుణ్ణి వీరాఘవాచార్యులుగారలు-మహాపండితులు-లెక్చరర్లు. ఆంధ్రగీర్వాణ విద్యాపీఠం పాలకమండలికి రాజమండ్రీ వాడ్రేవు జమీందారుగారు అధ్యక్షులు, శ్రీమానాప్రగడ శ్రీరాములుగారు కార్యదర్శి.

S.V.J.V. సంస్కృత కాలేజీ ఆవరణలో అడుగుపెట్టడమే, నాకొక దిగులు కలిగించిన అనుభవం.

అదొక మామిడితోట. తోటలో రెండు పెంకుటిళ్లు. ఒకటి Horizontal గా మరొకటి Vertical గా ఉండేవి. Vertical గా ఉన్న కొంచెంపెద్ద భవంతిలో Oriental High School నడిచేది. చూడగానే ఆ ఆవరణం ఏదో ఆశ్రమ ప్రదేశంలాగ ఉండేది. ఈ తోటని ఆనుకునే మరొక పెద్దఆవరణ, అందులో కడుపాతది, ముందు వైపు వెనకవైపు సుమారు పదిగదులున్నదీ పొడవాటి పెంకుటి భవంతి ఉండేది. అది హాస్టలు. ఆవరణలో పెద్ద గిలకబావి ఉండేది. ఒకమూలగా, కాగజ్‌నగర్ కాగితంమిల్లుకి ఉద్దేశించిన వెదుళ్లకట్టలు గుట్టలుగుట్టలుగా ఎత్తుగా పేర్చి ఉండేవి-

కాకినాడ పి.ఆర్.కాలేజీ సందడి నుంచి వచ్చిననాకు ఇక్కడ విద్యార్థుల తీరు చూస్తే వింతగా అనిపించింది. నీరుకావిబట్టలు-చొక్కాలు, పంచెలు ధరించిన వాళ్లు. అరుదుగా ప్యాంట్లు షర్టులు ధరించేవారు కనిపించేవారు. సూక్ష్మంగా చెప్పాలంటే బ్రాహ్మణ పేదరికం కళ్లకి కట్టినట్టుండేది. హాస్టల్లో ఉండే కొందరు సొంతంగా వండుకునేవారు. కొందరు ఊరి బ్రాహ్మణఇళ్లల్లో వారాలు చేసుకునేవారు. కొందరు మాధుకరం చేసుకునేవారు. ఊరి భోజనహోటళ్లలో పద్దులున్నవాళ్లు చాలా అరుదు. -కొవ్వూరు స్థానికులైన మగపిల్లలు, ఆడపిల్లలు కూడా ఉండేవారు.

ఈ కాలేజీలో రెండురకాల Oriental titles కి చదువు చెప్పేవారు. ఒకటి 'విద్యాప్రవీణ' కేవలం సంస్కృతమే చదువు. రెండవది 'భాషాప్రవీణ' ఇందులో తెలుగు, సంస్కృతం, సమానంగా

## అయిదవ ప్రకరణం

# విజయవాడ ప్రవేశం

ఏం చేయాలి? అనుకుంటూండగా–1969 జనవరి 11 తేదీనాడు ఆంధ్రప్రభ దినపత్రికలో సబ్–ఎడిటర్ ఉద్యోగానికి written test & interview కి పిలుపువచ్చింది. బెజవాడలో test&interview కి వెళ్లాను. నీలంరాజు వేంకటశేషయ్యగారు ఎడిటరు. అంతక్రితంనుంచి నేను వాళ్ల పత్రికకు వ్యాసాలు, కవితలు వ్రాస్తూండడం వల్ల, ఆయన ఆత్మీయంగా మాట్లాడారు. తప్పక ఉద్యోగం వస్తుందనే అనుకున్నాను. కాని–రాలేదు. కారణం హైదరాబాదులో Edition పెట్టే ఆలోచన వాయిదా వేసుకోవడంవల్ల, అప్పటి test లో పాసైన ఎవరికీ ఉద్యోగాలివ్వలేదట. ఒక్క– పురాణపండ రంగనాథ్‌కి మాత్రం ఇచ్చారని తెలిసింది.

1969 జనవరి నెలలోనే ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఉధృతంగా నడుస్తోంది. ఫిబ్రవరి 3వ తేదీనాడు మద్రాసు DMK ముఖ్యమంత్రి అన్నాదురై కేన్సర్‌వ్యాధితో మరణించాడు. ద్రవిడఉద్యమ ప్రముఖనేత!

ఆంధ్రప్రభలో ఉద్యోగం రాకపోయేసరికి నిరాశకలిగినా, అది తాత్కాలికం. ఎలాగైనా విజయవాడకి వెళ్లిపోవాలని ఆలోచన. అక్కడ ఏదైనా స్కూల్లో ఉద్యోగం ప్రయత్నించడమా? లేదా ఫాదర్ అగస్టిన్ సాయంకోరి విజయవాడ దగ్గర గుణదలలో ఉన్న బిషప్ గ్రాసీ హైస్కూలుకు బదిలీకోరడమా? –

ఈ ఆలోచనల్లో ఉండగా ఒకసారి విజయవాడ వెళ్లినప్పుడు, సత్యనారాయణపురంలో ఇంటినుంచి బయలుదేరి రైలుగేటుదాటి వెడుతూ–పక్కనే ఇంటిగోడకి "డాక్టర్ కొమ్మూరి వేణుగోపాలరావు" బోర్డుచూశాను. కాకినాడలో పూర్వపరిచయం దృష్ట్యా, ఒకసారి పలకరిద్దామని వెళ్లాను. ఆయన సాదరంగా ఆహ్వానించి నా సాహిత్యవ్యాసంగం, ఉద్యోగం వివరాలు అడిగారు. అప్పటికే ఆయన నవలారచయితగా ప్రసిద్ధుడు.



కొమ్మూరి వేణుగోపాలరావు

"రచనా వ్యాసంగం ఉన్న మీరు ఎక్కడో నిడదవోలులో ఉండడమేమిటి? బెజవాడ వచ్చెయ్యండి. ఆంధ్రజ్యోతి వారపత్రికలో సబ్ ఎడిటర్ కోసం చూస్తున్నారు. నేను ఆ పత్రిక చూసే పురాణం సుబ్రహ్మణ్యశర్మగారికి చెపుతా. మీరు వెళ్లి కలవండి" అన్నారు. నాకు గొప్ప ఆనందం కలిగింది.

# ఆరవప్రకరణం

## రేడియో ఉద్యోగం

నాజీవితంలో మరో పెద్దమలుపు సంభవించింది కూడ 1975లోనే-

ఆంధ్రజ్యోతి వారపత్రికలో 1969లో చేరేనాటికి నా విద్యార్హత 'భాషాప్రవీణ' బిరుదపట్టం మాత్రమే. ఆక్కడ పనిచేస్తూనే ఆంధ్రయూనివర్సిటీ బి.ఎ.(తెలుగుసాహిత్యం) చదివి పాసయ్యాను. ఎం.ఎ.కి కూడా చదివి, డిగ్రీ సంపాదించి, ఆంధ్రజ్యోతినుంచి బయటికి వెళ్లిపోవాలనుకుని-ఆప్రయత్నంలో ఉన్నాను. సరిగ్గా యీ సమయంలో-అంటే 1975 ఉత్తరార్థంలో విజయవాడ ఆలిండియా రేడియోకేంద్రంలో 'నిలయరచయిత' ఉద్యోగానికి ఖాళీ ఏర్పడింది. 1948లో విజయవాడ రేడియోకేంద్రం ఏర్పడ్డాక తొలుత నిలయరచయితగా, కృష్ణశాస్త్రిగారి మేనల్లుడు కవి అయిన శ్రీవింజమూరి శివరామారావు ఉండేవారు. అక్కడ ఆయన వందలకొద్దీపాటలు, నాటకాలు, సంగీతరూపకాలూ వ్రాసి ప్రసిద్ధికి వచ్చారు. ఆయన పదవీవిరమణ తరవాత బి.టి. పద్మినీదేవి అనే ఆమె ఆ ఉద్యోగంలోకి వచ్చి కొంతకాలం పనిచేశాక, ప్రముఖ లలిత సంగీతగాయకుడు, హైదరాబాదు రేడియో కేంద్రంలో ఉద్యోగి అయిన శ్రీ ఎమ్.చిత్తరంజన్‌తో వివాహంకావడంతో- ఉద్యోగం వదిలివెళ్లిపోయారు. ఆ ఖాళీలోకి శ్రీ విజయభూషణశర్మ అనే వ్యక్తి వచ్చిచేరారు. ఆ తరవాత కొంతకాలానికి శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావుగారు స్టేషన్ డైరెక్టరుగా వచ్చాక విజయవాడ కేంద్రంలోను, విశాఖపట్నం కేంద్రంలోనూ తెలుగు ప్రసంగశాఖల్లో రెండు ప్రయోక్తల ఉద్యోగాలు ఏర్పడ్డాయి. (విజయవాడలో శ్రీ జి.వి. కృష్ణారావుగారి పదవీవిరమణ కారణంగా ఒకటి, విశాఖకేంద్రంలో కొత్తగా ఒకటి). విజయవాడలోనే స్త్రీల, బాలల కార్యక్రమాల ప్రయోక్త ఉద్యోగం కూడా నింపవలసివచ్చింది.-ఆయీ కారణాలవల్ల, విజయవాడకేంద్రంలోనే అంతవరకు వ్యవసాయ కార్యక్రమాల విభాగంలో ఎడిటర్‌గా పనిచేసే ఉషశ్రీ తెలుగుప్రసంగాల విభాగంలోనూ, అనౌన్సర్‌గా పనిచేసే శ్రీపన్నాల సుబ్రహ్మణ్యభట్టు స్త్రీలు, బాలల కార్యక్రమాల విభాగంలోనూ, ప్రయోక్తలుగా నియమింపబడగా-శ్రీ విజయభూషణశర్మ విశాఖకేంద్రంలో తెలుగు ప్రసంగశాఖ ప్రయోక్తగా ఎంపికై వెళ్లిపోయారు. అందువల్ల విజయవాడ కేంద్రంలో నిలయరచయిత ఉద్యోగానికి ఖాళీ ఏర్పడింది. నేను దరఖాస్తుచేశాను. 1975చివరలో written test, interview జరిగాయి. నేను ఎంపికయ్యాను.

ఆ ఉద్యోగానికి నేను ఎంపికయ్యానని తెలిసి- అప్పటికే రేడియోకేంద్రంలో మిత్రులైన

అక్టోబర్ 15వ తేదీ నాడు- రేడియోలో, నేను అవసరమైన మార్పులు చేసిన నా రంగస్థల నాటకం "నెక్లెసు దొరికింది" ప్రసారమైంది. నాటకం బాగా కుదిరింది.

నా రేడియో మిత్రుడు సీనియర్ అనౌన్సర్, ఎంచదగిన రేడియో నటుడు శ్రీ ఎ.బి. ఆనంద్ Leave Travel Concession (L.T.C.) పై దక్షిణాది విహారయాత్ర చేసి వద్దామని ఉత్సాహపరచగా - డిసెంబరు పదకొండో తేదీన బయలుదేరాం. ఉదయం (12వ తేదీ) 8.00 గంటలకు మద్రాసు సెంట్రల్ స్టేషన్‌లో దిగాం. మరో నటుడు, రైల్వే T.T.E. మా మిత్రుడు శ్రీ కోనేరు రాజబాబు గారు అక్కడ కలిశారు. తిరువనంతపురం బయలుదేరాలంటే Reservation కష్టమైంది. ఎలాగో ఒకలాగ ప్రయత్నిద్దాం అని రాజబాబుగారు ధైర్యం చెప్పారు. రాత్రి Trivendram Mail ఎక్కాలి. ఈలోగా నగర ప్రవేశం చేసి కాసేపు బాపుగారిని, నవత ఆర్ట్స్ ప్రొడ్యూసర్ మిత్రులు నడింపల్లి కృష్ణంరాజు గారిని చూసివచ్చాం. రైల్వే రెస్టారెంట్లో భోజనం చేసి, అతి కష్టం మీద - రాజబాబు గారి చొరవతో - రాత్రి ఏడు గంటలకి త్రివేండ్రం మెయిలు ఎక్కాం. తెల్లవారుజాము నాలుగు గంటలవుతుండగా కేరళ - తమిళనాడు సరిహద్దు 'ఉలవకోడు' అనే చోట ఆనంద్ గారికీ, నాకూ రెండు ఫస్టు క్లాసు బెర్తులు ఇచ్చారు.

మద్రాసు - త్రివేండ్రం మధ్య 17 గంటల ప్రయాణం. దారి పొడవునా ఆకుపచ్చని కొబ్బరి తోటలు పొలాలూను. పచ్చదనం లేని గజం నేల కూడా లేదంటే అతిశయోక్తి కాదు. ప్రతి ఇంటి ఆవరణలోనూ విధిగా కొబ్బరి చెట్లున్నాయి. కొండలవెంట, గుట్టల వెంట ఏవేవో చెట్లే చెట్లు. కనిపించిన ఇళ్లలో చాలా వరకు బంగాళా పెంకుల చిన్న ఇళ్లే. అంత ఆకుపచ్చదనం సమ్మోహనకరంగా అనిపించింది. మర్నాడు మధ్యాహ్నం ఒంటి గంటకి త్రివేండ్రం చేరాం.

బయటకు వచ్చి హోటల్లో భోజనం చేశాం. ఉప్పుడుబియ్యం అన్నం. సాంబారు, వేడి చేసిన జీలకఱ్ఱ మంచినీళ్లు. అంటే దక్షిణాది యాత్రా భోజనాలకు నాంది అన్నమాట.

సాయంకాలం బస్సులో రిజర్వేషన్ చేసుకుని, రాత్రి 9.30 కి కన్యాకుమారి చేరాం. మెల్లగా ఒక ఏజెంటుని పట్టుకుని గది సంపాదించాం. రోజుకి అద్దె 20 రూపాయలు. దూరం నించి వచ్చే చల్లని సముద్రపు గాలికి ఆదమరిచి నిద్రపోయాం.

14వ తేదీ ఉదయం ఆరు గంటలకి లేస్తూనే సూర్యోదయం చూడడానికి లాడ్జి డాబా మీదకు వెళ్లాం. చుట్టూ లాడ్జీల డాబాలపై జనం !

ఎదుట మూడు సముద్రాల సంగమం. తూర్పు సముద్రం వైపు సూర్యోదయ దృశ్యం. మబ్బుల చాటు నుంచి సూర్యుడి ఉదయరాగాలు అద్భుతం. సముద్ర గర్భంలోంచి పుడుతున్నట్టుండే సూర్యదృశ్యం చూసే అదృష్టం లేకపోయింది. కాని - పచ్చి ఉదయపు ఎరుపు, పాలపిట్టరంగు, బంగారురంగు గొప్పగా ఉన్నాయి.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Inti+Peru+Indraganti**

* * *